క్లుప్తంగా

గృహ నిర్మాణాల వేగం పెంచాలి

వేమూరు: వైఎస్సార్ జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేయాలని గృహ నిర్మాణ శాఖ బాపట్ల జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టరు ప్రసాద్ తెలిపారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ప్రతి కాలనీలో గృహాలు లబ్ధిదారులు నిర్మించుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వేమూరు నియోజకవర్గం గృహ నిర్మాణంలో చాలా వెనుకబడి ఉందని తెలిపారు. అధికారులందరూ సమన్వయంతో పని చేయాలని పీడీ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, సీహెచ్ శేఖర్, గృహ నిర్మాణ శాఖ డీఈ రవికుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు బూత్ కమిటీ కన్వీనర్ల సమావేశం

వేమూరు: వేమూరు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో బూతు కమిటీ కన్వీనర్లకు సమావేశం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు బొల్లిముంత ఏడుకొండలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చుండూరు మండలంలో వలివేరు గ్రామంలోని కల్యాణ మండపంలో శుక్రవారం ఉదయం 9 గంటలకు బూత్ సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున పాల్గొంటారని ఆయన తెలిపారు. అమర్తలూరు మండల కేంద్రం పెన్ననర్ల భవనంలో ఉదయం 9.45 గంటలకు, వేమూరులో మండల కేంద్రం ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఉదయం 10.30 గంటలకు, కొల్లూరు మండల కేంద్రం రోటరీ క్లబ్ భవనంలో ఉదయం 11.15 గంటలకు, భట్టిప్రోలు మండలం పద్మశాలి కల్యాణ మండపంలో 12 గంటలకు సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. బూత్ కమిటీ కన్వీనర్లు తప్పకుండా హాజరు కావాలని పేర్కొన్నారు.

ఆటోను ఢీకొట్టిన కారు.. డ్రైవరుకు తీవ్ర గాయాలు

వేమూరు: జంపని గంగోలు వద్ద కారు ఆటోను ఢీ కొట్టడంతో డ్రైవరుకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసు వివరాల మేరకు.. వేమూరు మండలం బేతేలుపురానికి చెందిన పోతుల రోశయ్య తెనాలి రైల్వే స్టేషన్‌లో ఆటో సర్వీసు అందిస్తున్నాడు. ఈ నెల 18న తెనాలి నుంచి కొల్లూరు ప్యాసింజర్లను తీసుకొచ్చి, వదలి వెళ్తుండగా రాత్రి అర్ధరాత్రి జంపని గంగోలు వద్ద అతి వేగంగా వస్తున్న కారు అతని ఆటోను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవరుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనం క్షతగాత్రుడిని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ వైద్య శాలకు తరలించినట్లు ఎస్ ఐ నాగరాజు తెలిపారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి, విచారణ చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

తెనాలి రైల్వే ఇనిస్టిట్యూట్ నూతన కార్యవర్గ ప్రమాణం

తెనాలి రూరల్: దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్, ఎంప్లాయీస్ యూనియన్ మధ్య గత నెల 28న జరిగిన తెనాలి రైల్వే ఇనిస్టిట్యూట్ నూతన కార్యవర్గ ఎన్నికల్లో ఎంప్లాయీస్ సంఘ్ ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఎంప్లాయీస్ సంఘ్ నూతన కమిటీ సభ్యులు బుధవారం రాత్రి రైల్వే ఇన్స్టిట్యూట్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రమాణ స్వీకారం చేశారు. తెనాలి బ్రాంచి చైర్మన్ కె. వెంకటేశ్వరరావు, సెక్రటరీ సయ్యద్ బాజీ హుస్సేన్ ఆఫీస్ బేరర్స్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కొత్తగా ఎన్నికైన సెక్రటరీ రాజేష్, జోనల్ సెక్రటరీ ఉదయ్ కుమార్, ట్రెజరర్ బి.గౌరీ శంకరరావు, వర్కింగ్ కమిటీ మెంబర్లు బిక్కి రాంబాబు, జి. నరసింహారావు, జి. లోకనాథం, జె.కె. శివయ్య, సీహెచ్. చిట్టిబాబు, ఎస్. రాజశేఖరరెడ్డి తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్య అతిథిగా విజయవాడ డివిజినల్ ప్రెసిడెంట్ ఆకుల రాఘవేంద్ర, డివిజనల్ సెక్రటరీ ఆమంచి వెంకటేశ్వరరావు, ఇనిస్టిట్యూట్ చైర్మన్ చైతన్య హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీని పలువురు ఘనంగా సత్కరించి, అభినందనలు తెలియజేశారు.

ఘనంగా బ్యాంక్ ఆఫ్ బరోడా వ్యవస్థాపక దినోత్సవం



తెనాలి: బ్యాంక్ ఆఫ్ బరోడా స్థాపించి 116 సంవత్సరాలైన సందర్భంగా ఆ బ్యాంక్ అంగలకుదురు బ్రాంచిలో గురువారం ఖాతాదారులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. బ్యాంకు గుంటూరు రీజియన్ మేనేజరు ఎం.వి.శేషగిరి అధ్యక్షత వహించారు. బ్యాంకు సహకరించిన ఖాతాదారులు అందరికీ ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా బ్యాంకు తరపున అంగలకుదురులో నివసిస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కనగాల నాగభూషణం, వీరవల్లి మురళీ మాట్లాడుతూ బ్యాంక్ ఆఫ్ బరోడా సేవల్ని కొనియాడారు. బ్యాంకు మరింతగా విస్తరించి దినదినాభివృద్ధి చెందాలన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు. కార్యక్రమాన్ని బ్రాంచి మేనేజరు ఎం.రాజశేఖర్ పర్యవేక్షించారు.

పరిపాలనలో విప్లవాత్మకం 'జగనన్న సురక్ష'

- రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున
- కొల్లూరులో అర్జీదారులకు ధ్రువపత్రాల పంపిణీ
- పండుగలా జగనన్న సురక్ష శిబిరాలు



కొల్లూరులో ధ్రువపత్రం అందజేస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

కొల్లూరు: ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్న సంకల్పంతోనే సీఎం వైఎస్. జగన్మోహన్‌రెడ్డి 'జగనన్న సురక్ష' ద్వారా పరిపాలనలో విప్లవాత్మక మార్పునకు నాంది పలికారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. గురువారం కొల్లూరు గ్రామ సచివాలయం-1, సచివాలయం-2లో నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించే విషయంలో ఎలాంటి భేదాలు లేవని, చివరికి టీడీపీ నాయకుడైనా సరే పథకాలు వర్తింపజేయడం వైఎస్సార్ సీపీ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. సంక్షేమ పథకాల అమలులో ఎటువంటి అవినీతికి ఆస్కారం లేకుండా, లబ్ధిదారుల ఖాతాలకు నగదు జమ చేయడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ నీతివంతమైన పరిపాలనకు అద్దం పడుతోందన్నారు. 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా అనుభవమున్న చంద్రబాబు నాయుడు నాడు వ్యవసాయం దండుగ అంటూ రైతులను అవమానిస్తే, నేడు సీఎం వైఎస్ జగన్ వ్యవసాయం పండుగ అనే విధంగా రైతులకు వెన్నుదన్నుగా నిలిచారని ఆయన కొనియాడారు. చంద్రబాబు నాయుడు ఏనాడైనా ఎన్నికల హామీలు నెరవేర్చిన పాపాన పోలేదని, ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గమనించాలని కోరారు. ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలు పాటుపడుతున్న సీఎంగా చరిత్రలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచిపోతారని, ఆయనను మళ్లీ అధికారంలోకి తీసుకువస్తే.. ప్రజలకు మరింత మేలు చేస్తారని మంత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా సచివాలయం-1 పరిధిలో 1,106, సచివాలయం-2 పరిధిలో 1,365 ధ్రువ పత్రాల పంపిణీని మంత్రి మేరుగ నాగార్జున ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ చొప్పర సుబ్బారావు, వైస్ ఎంపీపీ మురాల రాంబాబు, సర్పంచులు రమావత్ విజయ, గొల్లపూడి వెంకటసుబ్బారావు, సూరపనేని వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ బావిరెడ్డి వెంకట్రామయ్య, వార్డు సభ్యురాలు అత్తోట రత్నకుమారి, జేసీఎస్ మండల ఇన్‌చార్జి అయిల సుబ్బారావు, జగనన్న సురక్ష ప్రత్యేకాధికారులు రమణ, రామదాసు, తహసీల్దార్ ఎ. శ్రీనివాసరావు, ఎంపీడీఓ ఐ.సత్యనారాయణరావు, ఈఓపీఆర్డీ రవికుమార్, మాజీ సర్పంచి సుగ్గున మల్లేశ్వరరావు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



చినమట్లపూడిలో ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎంపీపీ శ్రీకృష్ణయ్య



ఏట్రవారిపాలెంలో అర్జీదారునికి ధ్రువపత్రం అందజేస్తున్న ఏఎంసీ చైర్మన్ సీతారామిరెడ్డి

'జగనన్న సురక్ష'ను సద్వినియోగం చేసుకోవాలి

నగరం: జగనన్న సురక్ష శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య పేర్కొన్నారు. చినమట్లపూడి, పెదమట్లపూడి గ్రామాలలో గురువారం జరిగిన జగనన్న సురక్ష శిబిరాల్లో ఆయన పాల్గొని, మాట్లాడారు. పెదమట్లపూడిలో 1,400, చినమట్లపూడిలో 1,150 మందికి ధ్రువీకరణ ప్రతాలను అందజేసినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దారు ఎం.శ్రీనివాసరావు, ఎంపీడీఓ చక్రపాణి ప్రసాద్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

'సంక్షేమ' సారథి సీఎం వైఎస్ జగన్

కర్లపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని వైఎస్సార్ సీపీ కర్లపాలెం మండలాధ్యక్షుడు, బాపట్ల ఏఎంసీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి అన్నారు. ఏట్రవారిపాలెం, పెదగొల్లపాలెం గ్రామ సచివాలయాలల్లో గురువారం జరిగిన జగనన్న సురక్ష శిబిరాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమాలలో ఏట్రవారిపాలెం సర్పంచ్ చీరాల వెంకటలక్ష్మి, ఎంపీటీసీ చీరాల పద్మావతి, వైస్ ఎంపీపీ పందరబోయిన సుబ్బారావు, తహసీల్దారు కేశవనారాయణరావు, మండల ప్రత్యేకాధికారి బి.సైదానాయక్, ఈఓపీఆర్డీ ఎలీషాబాబు, డీటీ సలీమా, పంచాయతీ కార్యదర్శి డి.పద్మావతి, వీఆర్వోలు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

నేడు 'జగనన్న సురక్ష' శిబిరాలు

వేమూరు: జంపని గ్రామ సచివాలయం-1, చావలి గ్రామ సచివాలయం -2 లో జగనన్న సురక్ష క్యాంపులు శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జంపనిలో తహసీల్దారు శ్రావణ్‌కుమార్, పంచాయతీ విస్తరణాధికారి సీహెచ్ శేఖర్, చావలిలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, డిప్యూటీ తహసీల్దారు కె.కల్యాణి పాల్గొంటారని తెలిపారు.

భట్టిప్రోలులో..

భట్టిప్రోలు: భట్టిప్రోలు-1, వెల్లటూరు గ్రామ సచివాలయాల్లో శుక్రవారం జగనన్న సురక్ష శిబిరాలు శుక్రవారం జరుగుతాయని ఎంపీడీఓ గుమ్మా చంద్రశేఖరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ దావూరి వెంకటలలిత కుమారి, జెడ్పీటీసీ తిరువీధుల ఉదయభాస్కరి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొంటారని పేర్కొన్నారు.

రక్షణ సైన్యం ప్రవేశానికి నేటితో 128ఏళ్లు..



బాపట్ల: రాష్ట్రంలో రక్షణ సైన్యం ప్రవేశించి 128 సంవత్సరాలు అయిన సందర్భంగా బాపట్లలోని కమిటీ సభ్యులు ప్రదర్శన చేపట్టారు. ఇండియా సెంట్రల్ రాష్ట్రం రాష్ట్రీయ నాయకులు కల్నల్ యాకూబ్ మాసి కార్యక్రమాన్ని చీలురోడ్డు సెంటర్‌లో గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జులై 20, 1889లో రక్షణ సైన్యాన్ని స్టాఫ్ కెప్టెన్ అబ్దుల్ రఫీ, ఆయన సతీమణి స్టాఫ్ కెప్టెన్ అమీనా బాయ్ మొట్ట మొదటిసారిగా ప్రవేశపెట్టారని తెలిపారు. మొదటిగా విజయవాడ పట్టణంలో ఈ కార్యక్రమాలను ప్రారంభించారని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో లెఫ్ట్ కల్నల్ బి.జోసెఫ్, మండల నాయకులు లెఫ్ట్ కల్నల్ గేరా థామస్, గేరా సీయోనుకుమారి, శామ్యూల్ జోనాతన్, గేరా మణిభూషన్ తదితరులు పాల్గొన్నారు.

30న విద్యార్థులకు పురాణాలపై పోటీలు

తెనాలి: గుంటూరులోని టీటీడీ కల్యాణ మండపంలో ఈనెల 30న జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు హిందూ పురాణాలు, భారత, భాగవతాల్లోని అంశాలపై పోటీల్ని నిర్వహిస్తున్నట్లు తిరుమ ల తిరుపతి దేవస్థానాల ధర్మప్రచార మండలి సభ్యు డు తిరుక్కోవళ్లూరి పూర్ణయ్య వెల్లడించారు. ఆయన గురువారం తెనాలిలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముందుగా విద్యార్థులకు ఆయా అంశాల్ని బోధించి, పోటీల్ని నిర్వహిస్తామని తెలిపారు. విజేతలకు బహుమతులను అందజేస్తామని పేర్కొన్నారు.

సమగ్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యం

'గడప గడపకు మన ప్రభుత్వం'లో మంత్రి మేరుగ నాగార్జున



మండూరులో కరపత్రం అందజేస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

మండూరు(వేమూరు): సమగ్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. చుండూరు మండలంలోని మండూరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం ఆయన నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. బ్రోచర్లు అందజేశారు. గ్రామంలో రూ.40లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని, వ్యవసాయ సహకారం సంఘం ఆధ్వర్యంలో రూ.40 లక్షలతో నిర్మించిన గోదామును ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మేరుగ నాగార్జున మాట్లాడారు. అర్హులై ఉండి సంక్షేమ పథకాలు అందకపోతే తన దృష్టికి తీసుకురావాలని స్థానికులను కోరారు. గతంలో మాదిరి సంక్షేమ పథకాలు అందాలంటే లంచాలు ఇవ్వాల్సిన అగత్యం ప్రస్తుతం లేదన్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో గుంటూరు కో-ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ రాతంశెట్టి రామాంజనేయులు, ఎంపీటీసీ సూర్య ప్రసన్న, గ్రామ సర్పంచ్ జొన్న కూటి ఉమాదేవి, సొసైటీ అధ్యక్షుడు బ్రహ్మానందరెడ్డి, రాజేంద్ర ప్రసాద్, లక్ష్మీనారాయణ, జొన్నకూటి రాజేశ్వరరావు, వాసురెడ్డి, దేవిరెడ్డి వెంకటేష్, గాదె శివరామ కృష్ణారెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరంలో 200 మందికి పరీక్షలు



శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

తెనాలి: రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో గురువారం రూరల్ మండలం అంగలకుదురులో ఉచిత నేత్రవైద్యశిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి హాజరయ్యారు. రోటరీ క్లబ్ సేవల్ని కొనియాడారు. క్లబ్ అధ్యక్షుడు పావులూరి రాంబాబు మాట్లాడుతూ నేత్ర వైద్యశిబిరంలో పరీక్షలు చేయించుకున్నవారిలో అవసరమైన వారికి కళ్లజోళ్లు ఉచితంగా పంపిణీ చేస్తామని చెప్పారు. వైద్య శిబిరానికి సహకరించిన ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ గూడవల్లి శాఖకు ధన్యవాదాలు తెలియజేశారు. శిబిరంలో 200 మందికి నేత్ర వైద్య పరీక్షలు చేశారు. వీరిలో 62 మందికి శుక్లాల ఆపరేషను, 72 మందికి కళ్లజోళ్ల అవసరం ఉందని గుర్తించారు. శుక్లాల ఆపరేషను అవసరమైనవారికి రానున్న మంగళ, బుధ, గురువారాల్లో గూడవల్లిలో ఉచితంగా ఆపరేషను చేస్తామని, కళ్లజోళ్లను త్వరలో పంపిణీ చేస్తామని తెలిపారు. రోటరీ అసిస్టెంట్ గవర్నర్ కన్నెగంటి మురళీకృష్ణ, కార్యదర్శి ఎస్.వెంకటేశ్వరరావు, ఈదర వెంకట పూర్ణచంద్, చేతన్‌రాజ్, డాక్టర్ రవీంద్రనాథ్, గుమ్మడి ప్రసాద్, డి.మురళీకృష్ణ, వీరవల్లి శ్రీధర్, ఆలపాటి కిరణ్, అర్జునరావు, కుర్రా శ్రీనివాసరావు పాల్గొన్నారు. వైద్యశిబిరానికి ఆర్థిక, భోజన సదుపాయం కల్పించిన వీరవల్లి మురళి, కనగాల నాగభూషణానికి క్లబ్ తరపున ధన్యవాదాలు తెలియజేశారు.

మహేష్‌బాబు ఆధ్వర్యంలో విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ



సైకిళ్లను పంపిణీ చేస్తున్న వైద్యులు

తెనాలి రూరల్: సూపర్‌స్టార్ మహేష్‌బాబు కుమార్తె సితార జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన సౌజన్యంతో విజయవాడ ఆంధ్రా హాస్పిటల్స్ యాజమాన్యం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించింది. మహేష్‌బాబు దత్తత గ్రామమైన తెనాలి మండలం బుర్రిపాలెంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, హైస్కూలు, అంగన్‌వాడీ కేంద్రంలోని సుమారు 152 మంది విద్యార్థులకు ఆంధ్రా హాస్పిటల్స్ వైద్యులు పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. సితార జన్మదినాన్ని పురస్కరించుకుని మహేష్‌బాబు పంపిన సైకిళ్లను విద్యార్థినులకు అందజేశారు. డాక్టర్ సయ్యద్ ముదిసర్, డాక్టర్ ఆశ్రిత, డాక్టర్ స్వరూప, డాక్టర్ శ్రావ్య, డాక్టర్ శ్రేయ వైద్య పరీక్షలు చేశారు. డాక్టర్ పి.వి. రామారావు హెచ్‌ఎం జి. లలితప్రసాద్, పెమ్మసాని శ్రీనివాస్ పర్యవేక్షించారు.

రైతుబజారులో రాయితీపై బియ్యం, మినపగుళ్లు

తెనాలి: జిల్లా జాయింట్ కలెక్టర్ రాజకుమారి సూచనల మేరకు ప్రజలకు రాయితీపై బియ్యం మినపగుళ్లను విక్రయించేందుకు తెనాలి దాల్‌మిల్లర్స్ అసోసియేషన్, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్లు ముందుకొచ్చాయి. స్థానిక గాంధీనగర్లోని రైతుబజారులో మినపగుళ్ల స్టాల్‌ను, గంగానమ్మపేట రైతుబజారులో బియ్యం స్టాల్‌ను ఏర్పాటుచేశారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ గురువారం మధ్యాహ్నం ఆయా స్టాళ్లను ప్రారంభించారు. ప్రస్తుతం మార్కెట్‌లో మినపగుళ్లు కిలో రూ.110కి విక్రయిస్తుండగా, రాయితీ స్టాల్‌లో కేవలం రూ.98 లకే విక్రయిస్తామని వ్యాపారులు చెప్పారు. కిలో రూ.50 అమ్ముతున్న స్టీమ్ బియ్యాన్ని రూ.44కు, కిలో రూ.56 పలుకుతున్న బీపీటీ బియ్యాన్ని రూ.48కు అందజేస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వం, అసోసియేషన్ల సహకారంతో ఏర్పాటుచేసిన ఈ సౌకర్యాన్ని ప్రజలు వినియోగించుకోవాలని చైర్‌పర్సన్ కోరారు.

గ్రామీణులకు ఆధునిక వైద్య సేవలు



తూములూరు(కొల్లిపర): ఫ్యామిలీ డాక్టర్ విధానంతో గ్రామీణులకు ఆధునిక వైద్య సేవలు ఇంటి దగ్గరే అందుతున్నాయని డాక్టర్ చిక్కాల లక్ష్మీసుధ తెలిపారు. మండలంలోని తూములూరు సుగాలి కాలనీలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ సేవల్ని అందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన 104 వైద్య శిబిరంలో వైద్యాధికారి 80 మంది రోగుల్ని, ప్రాథమిక పాఠశాలలోని అంగన్‌వాడీ కేంద్రంలో 15 మంది పిల్లలకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. కాలనీలో నలుగురు దీర్ఘకాలిక రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకున్నారు. మందులు అందజేసి సూచనలు, సలహాలిచ్చారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ వాతావరణంలో మార్పులు, వర్షాల కారణంగా వచ్చే వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో 104 సిబ్బంది బొమ్ము కోటిరెడ్డి, సూపర్‌వైజర్ సాయిబాబు, ఏఎన్‌ఎం లలితకుమారి, ఆశా వర్కర్ కుమారి, లక్ష్మీతిరుపతమ్మ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా జగనన్న పాలన

- ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు
- అడవులదీవిలో గడప గడపకు మన ప్రభుత్వం



మహిళలకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు

నిజాంపట్నం: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు పాలన అందిస్తున్నారని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు తెలిపారు. అడవులదీవి సచివాలయం-2 పరిధి రామకృష్ణాపురం, గరువు, వీరంకివారిపాలెం గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మోపిదేవి మాట్లాడారు, కులమతాలకు, పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ఒక్కో కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఎంత లబ్ధి చేకూరింది, ఏ పథకం ద్వారా ఎంత నగదు లబ్ధిదారుల ఖాతాల్లో జమ అయ్యింది అనే విషయాలను వివరించారు. గ్రామాలలో తాగు నీరు, అంతర్గత రోడ్ల సమస్యలను గ్రామస్తులు ఎంపీ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో స్పందించిన మోపిదేవి త్వరలో రూ.18కోట్లతో తాగునీటి సమస్య పూర్తిగా తీరనుందని తెలిపారు. ఇప్పటికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిధులను మంజూరుచేసినట్లు వెల్లడించారు. ప్రస్తుతానికి వీరంకివారిపాలెంలో డీప్‌బోరు వేసి, నీరు అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అంతర్గత రోడ్ల సమస్యను త్వరలోనే పరిష్కరిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువ నాయకులు మోపిదేవి రాజీవ్, డీసీఎంఎస్ చైర్మన్ యార్లగడ్డ భాగ్యలక్ష్మి, ఎంపీపీ మోపిదేవి విజయనిర్మల, జెడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, సర్పంచ్ శొంఠి శ్రీనివాసరావు, బెల్లంకొండ బలరామయ్య, నాజర్‌ఖాన్, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటరు సర్వే నిర్వహించాలి



బీఎల్వోలతో మాట్లాడుతున్న తహసీల్దారు మల్లికార్జునరావు



బీఎల్వోలకు దిశానిర్దేశం చేస్తున్న తహసీల్దారు శ్రావణ్‌కుమార్

రేపల్లె: ఓటర్ల జాబితా సవరణకు నిర్వహించే సర్వే పారదర్శకంగా ఉండాలని తహసీల్దారు డి.మల్లికార్జునరావు ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో ఓటర్ల జాబితా సవరణపై బీఎల్వోలతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ నెల 21 నుంచి ఆగస్టు 21వ తేదీ వరకు నెల రోజులపాటు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో ఇంటింటికి వెళ్లి.. ఖచ్చితమైన సమాచారాన్ని సేకరించాలని బీఎల్వోలకు సూచించారు. మృతులు, డబుల్ ఎంట్రీలు గుర్తించి తొలగింపు ప్రక్రియ చేపట్టాలని చెప్పారు. 2024 జనవరి 1నాటికి 18 ఏళ్లు నిండిన యువత నుంచి ఓటు హక్కు దరఖాస్తు స్వీకరించాలని తహసీల్దారు దిశానిర్దేశం చేశారు. సర్వేలో నిర్వహించాల్సిన అంశాలపై శిక్షణనిచ్చారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ విజయసారథి, ఎలక్షన్ డీటీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు సర్వే పారదర్శకంగా చేపట్టండి

వేమూరు: ఓటర్ల జాబితా పొరపాట్లు లేకుండా, పక్కాగా సిద్ధం చేసేందుకు ఈ నెల 21 నుంచి ఆగస్టు 21వ తేదీ వరకు మండలంలోని బీఎల్వోలు ఇంటింటి సర్వే పారదర్శకంగా నిర్వహించాలని తహసీల్దారు శ్రావణ్‌కుమార్ ఆదేశించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో గురువారం నియోజకవర్గ స్థాయిలో బీఎల్వోలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు బీఎల్వోలకు దిశానిర్దేశం చేశారు. ఓటరు పేరు, ఆధారు నంబరు, ఇంటి పేరును ఓటరు జాబితాలో చూసుకోవాలని చెప్పారు. ఎలాంటి రాజకీయ ప్రభావం లేకుండా 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలని సూచించారు. సర్వేలో లోపాలుంటే.. సర్వే చేసిన వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. సర్వేకు వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్‌లను నియమించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొల్లూరు, భట్టిప్రోలు, అమర్తలూరు, చుండూరు తహసీల్దార్లు శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, మోహన్, కనకదుర్గ పాల్గొన్నారు.

గంజాయి కేసులో నలుగురు యువకుల అరెస్టు

- నిందితుల్లో ముగ్గురు విద్యార్థులు
- పరారీలో మరో ఇద్దరు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జనార్దనరావు, పక్కన సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్ఐ వెంకటేశ్వర్లు

తెనాలి రూరల్: గంజాయి తాగడంతో పాటు విక్రయిస్తున్న నలుగురు యువకుల్ని పోలీసులు అరెస్టు చేశారు. తెనాలి మండలం అంగలకుదురులోని శ్రీనగర్ కాలనీలో ఓ గదిలో అక్రమంగా నిల్వ ఉంచిన 1.4 కిలోల గంజాయిని పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. నలుగురిని అరెస్టు చేశారు. శ్రీనగర్ కాలనీలో గంజాయి విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారంతో రూరల్ సీఐ కె. శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో ఎస్ఐ చిరుమామిళ్ల వెంకటేశ్వర్లు బుధవారం సిబ్బందితో కలసి దాడులు చేశారు. గంజాయి సహా నిందితుల్ని అదుపులోకి తీసుకున్నారు. స్థానిక రూరల్ సర్కిల్ కార్యాలయంలో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నిందితుల వివరాల్ని డీఎస్పీ బి. జనార్దనరావు తెలియజేశారు. దుగ్గిరాల మండలం చింతలపూడికి చెందిన సంగం ఉదయ్ కిరణ్ అంగలకుదురు శ్రీనగర్ కాలనీలో ఓ గదిలో అద్దెకు ఉంటున్నాడు. ఇతడికి గుంటూరుకు చెందిన బొంతా నితీష్, అంగలకుదురుకు చెందిన క్రోసూరు వెంకట పవన్ సాయిరాం, తెనాలి చెంచుపేటకు చెందిన జమ్మల మూడి గోపీతో పరిచయం ఏర్పడింది. వీరంతా చెడు వ్యసనాలు, గంజాయికి అలవాటు పడ్డారు. వీరిలో బొంతా నితిన్, గుంటూరుకు చెందిన కటకం రాజేష్, దాసరి సంజయ్ వద్ద గంజాయి కొనుగోలు చేసి తెనాలిలో తన స్నేహితులతో పాటు ఇతరులకు విక్రయాలు చేస్తున్నాడు. వీరిపై నిఘా ఉంచిన పోలీసులు పక్కా సమాచారంతో దాడులు నిర్వహించి అంగలకుదురులోని గదిలో గంజాయి తాగుతుండగా అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుండి 1.4 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వీరికి సరఫరా చేస్తున్న గుంటూరుకు చెందిన కటకం రాజేష్, దాసరి సంజయ్ పరారీలో ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ. 14 వేలు ఉంటుందని చెప్పారు. నిందితుల్ని అరెస్టు చేసిన సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఏఎస్ఐ పోతురాజు, పీసీలు పి. శ్రీనివాసులు, ఎం. రాము, పి. లక్ష్మీకాంత్‌ను అభినందించారు.